







సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

సోమవారం 12-8-2024

సంపుటి: 20 సంచిక: 119
పేజీలు: 4 వెల: రూ.1


## సాగునీరు తక్షణమే విడుదల చేయాలి

**- కలెక్టర్‌కు విన్నవించిన వైకాపా నాయకులు రవికుమార్ -**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నారాయణపురం ఆనకట్ట కుడి కాలువ కింద సాగులో ఉన్న సంతకవిటి, పొందూరు, ఎచ్చెర్ల మండలాల్లో సుమారు 20వేల ఎకరాలు ఆయకట్టుకు సాగు నీరందించాలని రైతులతో కలిసి ఆమదాలవలస వైకాపా నాయకులు చింతాడ రవికుమార్ కోరారు. సోమవారం జెడ్పీలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ప్రతి ఏడాది జులై నెలలో ఆయకట్టుకు అధికారులు సాగునీరు విడుదల చేస్తే ఖరీఫ్ వరినాట్లు పూర్తయ్యేవని, ఈ ఏడాది మరమ్మతుల పేరుతో ఇప్పటి వరకు సాగునీరు విడుదల చేయలేదని, అందువల్ల నాట్లు వేయలేదన్నారు. ఎదలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. నాట్లు ఆలస్యంగా వేయడం వల్ల వరి దిగుబడిపై ప్రభావం చూపిస్తుందన్నారు. కాలువలో గు(ర్రపు డెక్కను తొలగించి దాన్ని కాలువలోనే విడిచిపెడుతున్నారని వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ నాసిరకంగా పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌కు తక్షణమే నిధులు నిలుపుదల చేసి ఖరీఫ్‌కు వెంటనే నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పొందూరు మండల రైతులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## కరపత్రం సరే..
## 'ఆఫ్‌లైన్' కహానీ ఏంటి?



- కుర్చీ కోసం డీఈవో తాపత్రయం
- కరపత్రంతో క్లీన్‌చిట్ ఇచ్చుకున్న చైతన్య
- గత బదిలీలపై లేని ప్రస్తావన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

- జబ్బు సాకు నిజం.. నన్ను ఎంపిక చేసుకున్న పెద్దలను రోడ్డెక్కించలేక, వారి ఆకాంక్షలకు అడ్డుగా నిలవడం ఇష్టంలేక, వాట్సాప్ బదిలీల కుంభకోణంలో ఇరుక్కోలేక ఆరోగ్యం సాకు చెప్పి తలవంచుకొని బయటకు వచ్చా.
- నాయకత్వం అంటే హోదా కాదు.. బాధ్యత. ఏ నాయకత్వ నిర్వహణలో ఓడిపోయానో, వెన్నుచూపానో, అవినీతితో అంటకాగానో తేల్చండి. సమాజమో, ప్రజాప్రతినిధులో, ఉన్నతాధికారులో ఒక బాధ్యతను అప్పగిస్తే ప్రభుత్వ కూలీగా ప్రజాధనానికి కాపలా కాయడమే తప్ప మ్యాచ్‌ఫిక్సింగ్, సిగ్గుమాలిన పనులు చేయడం జాతకంలోనే లేదు.
- ప్రజాప్రతినిధులకు నేను ఇచ్చే గౌరవం వారిని ఒక్కసారి అడగండి. వారితో నా ప్రవర్తన తీరు గూర్చి తీర్పు ఇవ్వడానికి ఈ ముఠా ఎవరు? మోసం చేసి, మాయ చేసి, మోచేతి నీరు తాగి ఉద్యోగాలు తెచ్చుకోడానికి నేను నిరుద్యోగిని కాదు.
- తినడం చేతకాకనే ఒక ప్రైవేటు స్కూల్ రికగ్నిషన్ రెన్యువల్‌కు ఆమోదం తెలపకపోవడం వల్ల గత నవంబర్‌లో శ్రీకాకుళం డిప్యూటీ డీఈవోగా తొలగించబడిన నిజం మీకు తెలుసుకదా!
- కొందరు పెద్దమనుషుల్లా తన కోసం, తన స్వార్థం కోసం ఒక సంస్థను, వ్యవస్థను బలి తీసుకుని ఎదిగే వ్యక్తిని కాదు. దేశం గర్వించదగ్గ స్థాయిలో నిలిచిన నా తల్లి డైట్ వమరవల్లిని సందర్శించండి. ఏ క్షణానైనా ఆ తల్లి ఒడిలో చేరడానికి ఎప్పుడూ సంసిద్ధంగానే ఉంటాను.

.. ఇదీ జిల్లా విద్యాశాఖాధికారి తిరుమలచైతన్య తనపై వస్తున్న ఆరోపణలకు వాట్సాప్‌లో ఇస్తున్న సమాధానం. 'సత్యం'లో వచ్చిన కథనం రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో తాను ఎక్కడా అవినీతికి పాల్పడలేదని, బదిలీల్లో పారదర్శకంగా వ్యవహరించానని చెప్పుకునే ప్రయత్నం చేశారు. సాకు నిజమే.. షోకు ఎక్కడ.. అంటూ ఒక కరపత్రాన్ని ఉపాధ్యాయ సంఘాల గ్రూపుల్లో - మిగతా 4లో


## దళిత ఉద్యోగులపై జీఎస్టీ జేసీ చిన్నచూపు

- మానసికంగా వేధిస్తున్నారని ఎస్పీకి ఫిర్యాదు
- జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షురాలు రాజేశ్వరి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దళిత ఉద్యోగులను విజయనగరం జీఎస్టీ జాయింట్ కమిషనర్ బుడుమూరు నాగార్జునరావు చిన్నచూపు చూస్తూ మానసికంగా వేధిస్తున్నారని జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షురాలు అలికాన రాజేశ్వరి ఆరోపించారు. సోమవారం ఎస్పీ మహేశ్వరరెడ్డిని గ్రీవెన్స్‌లో కలిసి నాగార్జునరావుపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2022లో జరిగిన బదిలీల్లో నాగార్జునరావు అనేక అక్రమాలకు పాల్పడి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు చేశారని ఫిర్యాదు చేసినందుకు తనను సస్పెండ్ చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. అక్రమ బదిలీలపై ఉన్నతాధికారులు విచారణ చేసి ఆరోపణలు వాస్తవమేనని నిర్ధారించారని పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని గ్రహించి పైరవీలు చేసి - మిగతా 4లో

• ఎడిటోరియల్

# అంతా మోదీ మోళీయేనా!

రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ఎన్డీయే ప్రభుత్వాలే ఉండటం వల్ల విభజన వల్ల తీవ్రంగా నష్టపోయిన ఆంధ్ర ప్రదేశ్‌కు కేంద్రం నుంచి ఇబ్బడిముబ్బడిగా నిధులు వచ్చేస్తాయని, పునర్విభజన చట్టంలోని హామీలన్నీ అమలై పోతాయని కూటమి పక్షాలు, రాష్ట్ర ప్రభుత్వం ఊదరగొడుతున్నాయి. కానీ వాస్తవంగా జరుగుతున్నది వేరేగా ఉంది. కేంద్రంలోని మోదీ సర్కార్ మాటలు తప్ప మూటలు విదల్చడంలేదని ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది. మొన్నటికి మొన్న కేంద్ర బడ్జెట్‌లో అమరావతి నిర్మాణానికి భారీ నిధులు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించగానే ఆహా.. ఓహో.. మేం సాధించేశాం.. అంటూ కూటమి నేతలు హడావుడి చేశారు. కానీ తీరా చూస్తే కేంద్రం ప్రకటించింది గ్రాంట్ కాదని.. అప్పేనని.. దాన్ని రాష్ట్ర ప్రభుత్వమే వడ్డీతో సహా తిరిగి చెల్లించాల్సి ఉంటుందని తేలిపోయింది. తృణమూల్ కాంగ్రెస్ సభ్యురాలు మహువా మొయిత్రా లోక్‌సభలో ఈ విషయం లేవనెత్తి కేంద్రం ప్రకటనలోని డొల్లతనాన్ని బయటపెట్టారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు సైతం దీనిపై స్పందిస్తూ అప్పేగానీ.. దాన్ని మంజూరు చేయడమే గొప్ప అన్నట్లు వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్‌లో అదొక్కటే తప్ప కీలకమైన పోలవరం, రైల్వేజోన్, ఉత్తరాంధ్ర-రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీ లకు నిధులిస్తామని శుష్క వాగ్దానం చేశారే తప్ప నిధుల కేటాయింపుల్లేవు. ఇక ఉపాధి హామీ పథకం పని దినాలు పెంచడంతో పాటు అదనపు నిధులు మంజూరు చేయించామని జనసేన చెప్పుకొంటోంది. కానీ అన్ని రాష్ట్రాలతో పాటు ఆ నిధులు, పనిదినాలు ఇచ్చారే తప్ప ఆంధ్రప్రదేశ్‌కే ప్రత్యేకించి ఇవ్వలేదన్నది చేదునిజం. ఇక శుక్రవారం పార్లమెంటులో రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్ దేశంలో ఎనిమిది కొత్త రైల్వేలైన్లు మంజూరు చేశా మని వాటిలో ఆంధ్రప్రదేశ్‌కు ఒక ప్రాజెక్టు ఉందని వెల్లడించారు. సుమారు 173 కి.మీ. నిడివిన పాండురంగ పురం(భద్రాచలం)-మల్కన్‌గిరి మధ్య నిర్మించే ఈ కొత్త లైను ఒడిశా, ఆంధ్ర, తెలంగాణల మీదుగా సాగు తుందని ప్రకటించారు. కానీ వాస్తవం ఏమిటంటే.. ఈ లైను ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలను టచ్ చేస్తూ వెళ్తుందే తప్ప దీనివల్ల రాష్ట్రానికి ఒనగూడే ప్రత్యేక ప్రయోజనం ఏమీ లేదు. ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి విశాఖ, గోదావరి జిల్లాలోని రెండు మూడు ఏజెన్సీ ప్రాంతాల మీదుగా తెలంగాణకు చెందిన భద్రాద్రి జిల్లా భద్రాచలాన్ని కలుపుతుంది. దీనివల్ల ఏజెన్సీ ప్రాంతాలకు రైలు కనెక్టివిటీ ఏర్పడుతుందన్నది వాస్తవమే అయినా మన రాష్ట్రంలోని ప్రయాణికుల అవసరాలు, సరుకు రవాణా రద్దీ తగ్గించడానికి పెద్దగా ఉపయోగపడే అవ కాశం లేదంటున్నారు. ఇంకో విషయం ఏమిటంటే కేంద్రం తాజాగా ప్రకటించిన ఎనిమిది కొత్త రైల్వే లైన్లలో మల్కన్‌గిరి-పాండురంగపురంతో పాటు మొత్తం ఐదు లైన్లు ఒడిశాకు ప్రయోజనం కలిగించేవే. గుణుపూర్-థేరుబలి లైను ఒడిశాలోని రాయగఢ జిల్లాను కవర్ చేస్తుంది. జునాగఢ్-నవరంగపూర్ లైన్ ఆ రాష్ట్రంలోని కలాహండి, నవరంగపూర్ జిల్లాలను, బాదాంపహార్-కేందుఝర్ లైన్ కేందుఝర్, మయూర్‌భంజ్ జిల్లాలను, బంగ్రిపోసి-గోరుమా హిసానీ మయూర్‌భంజ్ జిల్లాను.. బురామర-చాకులియా లైన్ జార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశాల్లోని ఈస్ట్ సింగ్‌భూమ్, ఝూర్‌గ్రామ్, మయూర్‌భంజ్ జిల్లాలను కవర్ చేస్తాయి. మిగతా రెండు లైన్లు మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాలకు చెందినవని రైల్వేమంత్రి చేసిన ప్రకటన, రైల్వేశాఖ విడుదల చేసిన వివరాలను బట్టి స్పష్టమవుతోంది. కానీ మన ప్రధాన స్రవంతి పత్రికలు ఈ అంశాలను పట్టించుకోకుండా రాష్ట్రానికి పెద్దగా ఉపయోగపడని మల్కన్‌గిరి-పాండురంగపురం లైనునే మహాభాగ్యమన్న భావించి.. ఆబ్బో కొత్త లైను వచ్చేసిందని వార్తలు అచ్చేశాయి. దీని బదులు ఇప్పటికే ప్రతిపాదనల్లో, నిర్మాణంలో ఉన్న రైల్వే లైన్లు, విశాఖ కేంద్రంగా ప్రకటించిన రైల్వేజోన్ గురించి ప్రస్తావించి ఉంటే బాగుండేది. ఇక కేంద్ర బడ్జెట్‌లో నిర్మలమ్మ చేసిన మరో ప్రకటనను అసలు తెలుగు మీడియా పట్టించుకోనేలేదు. వికసిత భారత్‌లో భాగంగా బడ్జెట్‌లో పూర్వో దయ స్కీంను కొత్తగా తెచ్చారు. పూర్వోదయ అంటే అర్థం తూర్పు వికాసం లేదా తూర్పు వెలుగు. పేరుకు తగ్గట్లే దేశంలోని తూర్పు రాష్ట్రాల అభివృద్ధిపై పూర్వోదయ పథకం ద్వారా దృష్టి సారిస్తారు. అంతవరకు బాగానే ఉంది. కానీ కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ తూర్పు రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్‌ను కూడా చేర్చేయడం విస్మయం కలిగిస్తోంది. మనదేశాన్ని నైసర్గికంగా ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ, ఈశాన్య రాష్ట్రాలుగా వర్గీకరించారు. ఈ లెక్కన చూస్తే ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత రాష్ట్రం. ఇప్పటివరకు ప్రభుత్వాలు, ప్రజలు ఆ విధంగానే వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా తూర్పు రాష్ట్రాలంటే బీహార్, పశ్చిమబెంగాల్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాలే. కానీ పూర్వోదయ పథకం ద్వారా లబ్ధిపొందే రాష్ట్రాల గురించి నిర్మలమ్మ చెబుతూ ఆ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌ను కూడా చేర్చేశారు. ఈ రాష్ట్రాల సర్వతోముఖాభివృద్ధికి పూర్వోదయ పథకం కింద ప్రత్యేక ఆర్థిక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని ప్రకటించారు. దీనిపై ఒడిశా మాజీ సీఎం, బిజూ జనతాదళ్ అధినేత నవీన్‌పట్నాయక్ ఘాటుగానే స్పందించారు. కేంద్రం తన స్వప్రయోజనాల కోసం భౌగోళిక సరిహద్దులను మార్చేస్తోందా? అని నిలదీశారు. తూర్పు రాష్ట్రాల అభివృద్ధి పేరుతో ప్రతిపాదించి పూర్వో దయ పథకం కింద దక్షిణాది రాష్ట్రమైన ఆంధ్రకు ఒక్క రూపాయి ఇచ్చినా అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. వీటన్నింటిని నిశితంగా పరిశీలిస్తే మోదీ సర్కారు ఆంధ్రప్రదేశ్ విషయంలో మాటల మాయాజాలం చేస్తున్నట్లు అనిపించడం లేదూ!

## మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన తప్పనిసరి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై యువతకు అవగా హన తప్పనిసరి అని, యువతపై మాదకద్రవ్యాల ప్రభా వం పడకుండా వాటి నియంత్రణే లక్ష్యంగా కృషి చేయా లని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సోమవా రం స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో 'నాష' ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ, మొక్కలు నాటడం, అవగాహన కార్యక్రమాలను మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశ అభివృ ద్ధిని ప్రగతిని ముందుకు తీసుకెళ్లవలసింది విద్యార్థినీ విద్యా ర్థులేనని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. యువతను చెడు మార్గం వైపు నడిపించే మాదకద్రవ్యాల అమ్మకాలు చేస్తున్నవారి సమాచారం తెలియజేయాలని, వాటిని అరికట్టేందుకు ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యత నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కళాశాలల విద్యా ర్థులచే ప్రతిజ్ఞ చేయించి, మాదక ద్రవ్యాల నివారణ, దుష్ప్రభావాలపై అవగాహన కల్పించే నినాదాలు చేశారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నివారణ అందరి బాధ్యతని, ప్రతిఒక్కరికి అవగాహన అవసరమని ఎందుకు అందరూ సహకరిం చాలన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ కార్య క్రమంలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఈ కార్యక్రమం నిర్వహణ ముఖ్య ఉద్దేశం స్వతంత్రం వచ్చి 78 సంవత్సరాలు పూర్తయిందని, ఈ సందర్భంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతిఇంటిపై జాతీయజెండా ఎగురువేయాలని, స్వాతంత్ర్య సమరయోధుల పోరాటం వివరాలు వివరించారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి అందరూ సహకరించాలని, అందులో విద్యార్థినీ విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతిశ్రీ మాట్లాడుతూ నాష ముక్తభారత్ అభియాన్ కార్యక్రమాన్ని కేంద్ర సోషల్ జస్టిస్ ఎంపవర్మెంట్ శాఖ, భారత ప్రభుత్వం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ఈ అవగా హన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్ర మంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంలో భాగంగా సంత కాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్, జేసీ, ఎమ్మెల్యేలు ముందుగా సంతకాలు చేయగా, అధికారులు, వివిధ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు సంతకాల కార్యక్ర మంలో భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో ఆర్ఐవో దుర్గాప్రసాద్, డీవీఈవో తవిటినాయుడు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీఎస్ సత్యనారాయణ, ఎన్‌సీసీ కెప్టెన్ డాక్టర్ వై.పోలినాయుడు, డీఎఫ్‌వో ప్రతినిధి నాగేంద్ర రావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.శ్రీనివాస్ పాత్రో, ఆర్.వెంకట్రావు, నారాయణ, శ్రీచైతన్య, తిరుమల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కేడిట్స్ పాల్గొన్నారు.

## ఉత్తమ సమాజ నిర్మాణమే 'మానవత' ధ్యేయం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉత్తమ సమాజ నిర్మాణమే మానవత ధ్యేయమని నూత న అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రవేట్ హాల్‌లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకరణ కార్యక్రమం అట్టహా సంగా జరిగింది. నూతన అధ్యక్షులుగా పొన్నాడ రవికు మార్, సెక్రటరీగా శ్రీనివాసరావు, కోశాధికారిగా సింగూ రు ప్రవీణ్‌లు ప్రమాణ స్వీకారం చేసారు. ఈ సందర్భం గా రవికుమార్ మాట్లాడుతూ 'మానవత' సంస్థ కులమ తాలకు అతీతంగా అందరూ మమేకమై విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి కృషి చేస్తుందన్నారు. కార్య క్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ రజనీకాంత్, రిటైర్డ్ డీఎస్పీ భార్గవ నాయుడు, బి.లక్ష్మణరావు, సుమతి రెడ్డి, చైర్మన్ డి.విష్ణు మూర్తి, వైస్ చైర్మన్ నటుకుల మోహన్, డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, బి.దేవభూషణం, ఉర్లం శివతేజ, పొడుగు చరణ్, సీపాన రమేష్, టూరిజం నారాయణరావు, సెట్‌శ్రీ సీఈ వో ప్రసాదరావు, టి.రాంగోపాల్, టి.అప్పలనాయుడు, కొమ్ము రమణమూర్తి, ఆర్మీ కాలింగ్ విద్యార్థులు, ఆడపిల్ల ఫౌండేషన్ అధ్యక్షురాలు లావణ్య, కోరాడ హరిగోపాల్, మదర్స్ హెల్పింగ్ సొసైటీ ప్రదీప్‌లు పాల్గొన్నారు.

## శిష్టకరణ సంఘ ప్రతినిధి మృతి

(సత్యంన్యూస్, కాశీబుగ్గ)



జిల్లా శిష్టకరణ సంఘం ప్రతినిధి భవాని శంకర్ అనారోగ్యంతో మృతి చెందారు. పలాస-కాశీబుగ్గ మున్సి పాలిటీ 16వ వార్డు చెందిన వైకాపా నాయకుడు డబ్బీరు భవానీ శంకర్ (55) ఆదివారం రాత్రి అనారోగ్య సమస్యతో బాధపడుతూ పలాస కిడ్నీ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతూ తుదిశ్వాస విడిచారు. భవానీ శంకర్ ప్రస్తుతం పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, 16వ వార్డు వైకాపా ఇన్‌ఛార్జిగా, శిష్టకరణ సంఘ నాయకులుగా వ్యవహరించారు.

## డ్రైవర్ కుటుంబానికి సాయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శాంతినగర్ కాలనీకి చెందిన మంచ్యాల లక్ష్మణరావు అనే డ్రైవర్‌కి కొద్ది రోజుల క్రితం ప్రమాదం జరిగి శరీరంలో చాలా భాగాలు దెబ్బతిన్నాయి. ఆపరేషన్ కూడా చేయించారు. తోటి డ్రైవర్ కావడంతో విజయనగరం డ్రైవర్ హెల్పింగ్ హాండ్స్ సభ్యులందరూ కలిపి రూ.27,604 నగదు, రూ.4వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు అందించారు.



## రహదారి భద్రత నియమాలు తప్పనిసరి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రహదారి భద్రత నియమాలు తప్పనిసరిగా ప్రతి వాహ నదారుడు పాటించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశిం చారు. ఈమేరకు జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు రహదారి మార్గాలు, ముఖ్యమైన జంక్షన్లలో విజి బుల్ పోలీసింగ్‌లో భాగంగా రోడ్డు భద్రత నియమాలు పాటిం చని వారికి జరిమానాలు విధిస్తూ, రోడ్డు భద్రత నియమాలపై ఆటో డ్రైవర్లు, హెల్మెట్ ధారణ గురించి వాహనదా రులకు అవగాహన కల్పించారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు చేస్తూ పటిష్ట చర్యలు చేపడుతున్నారు.



# ప్రతీకారంలో ఇదో వెరైటీ!

రివైంజ్ డ్రామాలు తెలుగు ఆడియన్స్ కు కొట్టిన పిండి. ఓ బిగ్గెస్ట్ కమర్షియల్ సినిమా తీసుకొన్నా, అందులో 'ప్రతీకారం' అనే పాయింట్ కచ్చితంగా కనిపిస్తుంది. అయితే హీరో ఆ ప్రతీకారాన్ని ఎవరిపై, ఎందుకు, ఎలా తీర్చుకొన్నాడన్నదే ఆసక్తికరం. ఈరోజు విడుదలైన 'సింబా'లోనూ రివైంజ్ డ్రామా ఉంది. కానీ అదో వెరైటీ కాన్సెప్ట్. మరి ఆ రివైంజ్ ఎలా సాగింది? ఆ వెరైటీ ప్రేక్షకులకు ఎంత వరకూ నచ్చుతుంది..?

అక్ష (అనసూయ) ఓ స్కూల్ టీచర్. వరుసగా మూడు సార్లు ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకొం టుంది. చీమకు కూడా హాని తలపెట్టదు. ఆ కాలనీలో తనంటే అందరికీ చాలా గౌరవం. మరోవైపు ఫాజిల్ (శ్రీనాథ్ మాగంటి) కథ. తనో ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్. అభ్యుదయ భావాలు కల కుర్రాడు. ఇంకోవైపు.. అన్సారీ (అనీష్ కురువిల్లా) ఓ పేరు మోసిన డాక్టర్. ఎందరినో తన హస్తవాసితో కాపాడతాడు. ఇలాంటి ఈ ముగ్గుర్లో ఒకరితో మరొకరికి సంబంధమే ఉండదు. కానీ నడిరోడ్డుపై ఓ వ్యక్తిని అత్యంత కిరాతకంగా హత్య చేస్తారు. కానీ 'ఈ హత్య తో మాకు ఎలాంటి సంబంధం లేదు' అంటారు. పైగా చాలా మర్యాదగా కనిపించే ఈ ముగ్గురూ.. ఇలా ఎందుకు ఫ్లిప్ అయ్యారు? వీళ్ల వెనుక ఎవరు ఉన్నారు? వీరిలో ఈ ఊహించని మార్పుకి కారణ మేంటి? అనేది మిగిలిన కథ.


ముందు చెప్పుకొన్నట్టు ఇది కూడా ప్రతీకార కథే. కానీ ఇందులో ఓ వెరైటీ ఉంది. బయోలాజికల్ మెమొరీ అనే పాయింట్ యాడ్ చేశారిందులో. అది కొత్త తరహా కాన్సెప్ట్. ఆ కాన్సెప్ట్‌ని ఎక్కడ, ఎందుకు, ఏ రూపంలో వాడారు? అనేది సినిమా చూసి తెలుసుకో వాల్సిందే. సినిమా సక్సెస్ కావాలంటే పాయింట్ ఉంటే సరిపోదు. దానికి సరిదా ఎక్సక్యూషన్ ఉండాలి. నిజానికి ఇదే పాయింట్ తో ఓ మల్టీస్టారర్ సినిమాని కొత్త కోణంలో, పూర్తి స్థాయి యాక్షన్ థ్రిల్లర్ గా, పక్కా కమర్షియల్ మీటర్‌లో తీసి ఉండొచ్చు. బహుశా బడ్జెట్ పరిమి తుల వల్ల అది సాధ్యం కాలేదేమో. అయితే ఉన్నంతలో గ్రిప్పింగ్ గా, ప్రేక్షకుల్ని రెండు గంటల పాటు థియేటర్లో కూర్చోబెట్టే కంటెంట్ ఈ పాయింట్‌లో ఉంది. అక్షగా అనసూయ పాత్రని పరిచయం చేస్తూ ఈ కథని మొదలెట్టారు. ఫ్లిప్ పాయింట్ కూడా త్వరగా వచ్చే సింది. బొద్దింకను చంపడానికి భయపడే ఓ సాధారణ టీచర్, క్రూరంగా హత్య చేయడం, ఆ తరవాత తనకేం తెలీనట్టు ప్రవర్తిం చడం ఆసక్తి కలిగిస్తుంది. ఆ తరవాత ఇలాంటి పరిస్థితులే మరో ఇద్దరికి ఎదురవ్వడం, వరుస హత్యలు ఇవన్నీ ప్రేక్షకుడ్ని కథలోకి తీసుకెళ్తాయి.

అయితే ఇన్వెస్టిగేషన్ చేసిన పద్ధతి మాత్రం చాలా సిల్లీగా, మరీ రొటీన్‌గా అనిపిస్తుంది. ఎంతసేపూ, సీసీ ఫుటేజీలు చూసుకో వడం, కాల్ రికార్డింగులు అంటూ హడావుడి చేయడం తప్ప ఇన్వెస్టిగేషన్ లో కొత్త కోణం, ఆసక్తి కలిగించే విషయాలూ ఏం కనిపించవు. ఇంట్రవెల్ బ్యాంగ్ మాత్రం బాగుంది. సెకండాఫ్ పై కాస్త ఆసక్తి పెరుగుతుంది. కాకపోతే ఈ సినిమాలో సింబగా జగపతి బాబు కనిపిస్తాడన్న విషయం ప్రచారం చిత్రాల్లో ముందే చెప్పేశారు. ఈ హత్యల వెనుక సింబ హస్తం ఉందన్న సంగతి అర్థమైపోతుంది. దాన్ని ట్విస్ట్ గా దాచారు. అయితే ఆ సింబ తీర్చుకొనే రివైంజ్‌లో బయలాజికల్ మెమొరీ అనే పాయింట్ కొత్తగా అనిపిస్తుంది. ఇలా క్కూడా రివైంజ్ తీర్చుకోవొచ్చా అనిపించింది. దానికి తగ్గ సెంటిఫిక్ ఆధారాలు చివర్లో చూపించారు కూడా. పాయింట్ పరంగా బలంగా అనిపించిన ఈ కథ.. తెరపైకొచ్చేటప్పటికి తేలిపోయింది. బలమైన సన్నివేశాలు, ఎమోషన్, గ్రిప్పింగ్ స్క్రీన్ ప్లే లేకపోవడంతో పాయింట్ క్రమక్రమంగా చేజారిపోయింది. ప్రకృతి, పర్యావరణం అంటూ ఓ బలమైన సామాజిక అంశాన్ని ఈ కథలో ముడిపెట్టడానికి చూశారు. అదీ కృత్రిమంగానే అనిపించింది. కాకపోతే.. దమ్ము కొట్టడం వల్ల కంటే, దుమ్ము వల్లే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయన్న కఠోరమైన సత్యాన్ని ఈ సినిమాతో చెప్పి, ఓ హెచ్చరిక జారీ చేసింది చిత్రబృందం.

సంపత్ నంది ఈ చిత్రానికి సంభాషణలు, స్క్రీన్ ప్లే అందించారు. ఐడియా వరకూ బాగుంది. ఇంకాస్త బాగా తీయాల్సింది. దర్శకుడు మురళీ మనోహర్ రెడ్డికి ఇది తొలి చిత్రం. మరొకరి కథని ఓన్ చేసుకొని.. తెరకెక్కించడం కొంచెం కష్టమైన ప్రక్రియే. సంపత్ నంది జిస్ట్ ని ఆయన బాగానే అర్థం చేసుకొన్నారు. ఓ లెంగ్తీ సన్ని వేశాన్ని సింగిల్ షాట్‌లో చూపించే ప్రయత్నం చేశారు. అది బాగుంది. దర్శకుడిగా తన కష్టం ఇలాంటి సన్నివేశాల్లో కనిపించింది. పాటలు లేకపోవడం ప్లస్ పాయింట్. నేపథ్య సంగీతానికి స్కోప్ ఉంది. యాక్షన్ సన్ని వేశాల్లో వినిపించిన బీజియమ్స్ బాగు న్నాయి. నిడివి కూడా ఇబ్బంది పెట్టదు. రెండు గంటల్లో సినిమా ముగిసింది.

అనసూయకు ఇది కాస్త కొత్త తరహా పాత్రే. హెూమ్లీగా కనిపించింది. తనతో యాక్షన్ కూడా చేయించారు. జగపతిబాబు క్యారెక్టర్ సెకండాఫ్‌లో వస్తుంది. భారతీయుడు టైపులో.. రెండు వేళ్లతో ప్రాణాలు తీసే టెక్నిక్ ఈ పాత్రకు అన్వయించారు. అది కాస్త అతిగా అనిపిస్తుంది. చాలా కాలం తరవాత జగపతి బాబు యాక్షన్ సీన్లలో కనిపించడం విశేషం. గౌతమి పాత్ర పరిధి చిన్నదే. కానీ.. తన ఇంపాక్ట్ కూడా తెరపై సరిగా కనిపించలేదు. తను డాక్టర్ అనే విషయం మర్చిపోయి సీఐడీ ఆఫీసర్ అన్నట్టు ప్రవర్తిస్తుంటుంది ఆ పాత్ర. కబీర్ సింగ్ సైతం భయపెట్టలేక పోయాడు.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో...




## డాడీ మీద కోపంతోనే దానిని లేపేసా!



మలయాళం బ్యూటీ సంయుక్తా మీనన్ గురించి పరిచయం అవసరం లేదు. 'భీమ్లా నాయక్' తో ఎంట్రీ ఇచ్చిన అమ్మడ కెరీర్ టాలీవుడ్ లో తిరుగు లేకుండా సాగిపోతుంది. 'బింబిసార', 'సార్', 'విరూపాక్ష' లాంటి హిట్ సినిమాలతో అమ్మడి క్రేజ్ మరింత పెరిగింది. అన్నింటిని మించి ఆరంభంలోనే స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ ప్రశంసలందుకునే ఎంట్రీ ఇచ్చింది. ఆయన ఆశీర్వాదం కూడా కలిసొచ్చింది. గతేడాది నాలుగైదు సినిమాలో ప్రేక్షకుల ముందు కొచ్చిన అమ్మడు 2024 లో మాత్రం రిలాక్స్ అవుతుంది. కొత్త సినిమాల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే కొత్త సినిమాలకు సైన్ చేయలేదు. అయితే నిఖిల్ తో మాత్రం పాన్ ఇండియా సినిమా 'స్వయంభూ' లో నటిస్తోంది. తాజాగా బాలీవుడ్‌కి కూడా ప్రమోట్ అయింది. ఇలా కెరీర్ పరంగా సంయుక్తా మీనన్ ఎలాంటి ఢోకా లేదు. అయితే వ్యక్తిగత జీవితంలో మాత్రం మనసు గాయ పడిన సందర్భం గుర్తు చేసుకుంది. సంయుక్తా మీనన్ నుంచి 'మీనన్' పేరును తొలగించింది. అయితే ఇలా మీనన్ని తొలగించడంపై నేరుగా ఆమెనే ప్రశ్నించడంతో ఆసక్తి కర సమాధానం చెప్పింది. 'అమ్మ నాన్న విడిపోయారు. అమ్మ అంటే ఎంతో ఇష్టం. అంతే గౌరవం. తన ఫీలింగ్స్ అన్నింటిని గౌరవించి పేరులో నుంచి సర్ నేమ్ తీసేసాను. నేను ఆడ, మగ సమానం అనే నమ్ముతా నం. ఎవరూ ఎక్కువ కాదు..తక్కువ కాదు. నా జీవితంలో అలాంటి సందర్భం ఎదురైందని పురుషలందరి విషయంలో ఒకేలా ఉండటం అన్నది పెద్ద తప్పు. నా కుటుంబంలో జరి గిన సంఘటన అంత వరకే పరిమితం. అంతకు మించి తప్పుగా భావిం చాల్సిన పనిలేదు' అని తెలిపింది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...



బంగ్లాదేశ్ ఆపద్ధర్మ ప్రధానిగా యూనస్

బ్రహ్మరథం పట్టిన యువతరం

గాడితప్పిన బంగ్లాను దారిలో పెట్టగలడని నమ్ముతున్న సామాన్య జనం

# యూనస్

# బంగ్లాదేశను గాడిలో పెడతారా?

- దుప్పల రవికుమార్

దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల పట్ల తీవ్రమైన ఆగ్రహంతో రగిలిపోతున్న బంగ్లాదేశ్ ప్రజలు తమ తాత్కాలిక ప్రభుత్వానికి సారధిగా డాక్టర్ మహమ్మద్ యూనస్‌ను ఎన్నుకుని ప్రపంచాన్ని నివ్వెరపరిచారు. ఇందులో ప్రధాన పాత్ర సోనార్ బంగ్లా ప్రజా సంఘాలదే. యూనస్ రాజకీయ విశ్వాసాలు, అభిప్రాయాలు, ప్రజాసమూహంలో ఆయనకున్న పలుకుబడి అతనికి ఈ అవకాశాన్ని తెచ్చిపెట్టాయి. తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నామని సైన్యం ప్రకటించినప్పుడు మన పొరుగుదేశం పాకిస్తాన్ మాదిరి ఎన్నికలయ్యేంత వరకు సైన్యం బంగ్లాను పరిపాలిస్తుందని ప్రపంచ దేశాలు భావించాయి. అకస్మాత్తుగా యూనస్ పేరు తెర మీదకు రావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. గత పదిహేనేళ్లుగా రాజకీయ నిరంకుశత్వంతో విసిగి వేసారిపోయిన బంగ్లాదేశ్ ప్రజలకు మహమ్మద్ యూనస్ రూపంలో స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నట్టనిపించింది. సమాజంలో మహిళలకు కొత్తగా రెక్కలు తొడిగి, కొత్త ద్వారాలు తెరిపించిన యూనస్ పట్ల ఆ దేశానికి గొప్ప ఆశలున్నాయి. ఈ విపత్కర సమయంలో ఆ దేశంలో అతని కంటే గొప్ప వ్యక్తిని కూడా ఆ పదవిలో మరొకరిని ఊహించలేం.

మహమ్మద్ యూనస్ ఆర్థిక శాస్త్రంలో విశ్వవిద్యాలయ ఆచార్యులు అయినప్పటికీ, ఒక ప్రొఫెసరుగా ఎవరూ ఆయనను గుర్తించరు. ఆయన గ్రామీణబ్యాంకు వ్యవస్థాపకుడిగానే ప్రపంచవ్యాప్తంగా అందరికీ పరిచయం. లక్షలాదిగా మహిళలను విజయవంతమైన వ్యాపారస్తులుగా తీర్చిదిద్దిన ఒక గొప్ప సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా, ప్రజాసంఘాల నాయకుడిగా సుపరిచితుడు. రాజకీయ పార్టీల పట్ల ప్రజలు తీవ్ర విముఖత చూపిస్తున్నపుడు సహజంగానే అక్కడ పౌరసంఘాల మాట చెల్లుబాటు అయిందని మనం భావించాలి. ముఖ్యంగా విద్యార్థి సంఘాల నాయకుల మద్దతు ఎక్కువగా ఆయనకు ఉంది. అక్కడి విద్యార్థులు ఇప్పుడు యావత్‌ప్రపంచానికి ఒక కొత్తపాఠం చెప్పడానికి సిద్ధమయ్యారు. అయితే షేక్ హసీనా ప్రభుత్వాన్ని పడగొట్టడానికి వారు నిర్వహించిన ప్రజాపోరాటంలో విపరీతమైన హింస చెలరేగడం కొంత బాధాకరం. వారు రక్తపాతానికి పాల్పడకుండా, ఆస్తుల విధ్వంసానికి దిగకుండా అహింసాత్మకంగా ఈ ఉద్యమం చేసి ఉండొచ్చు. కాని, అశాంతితో రగిలిపోతున్న యువతరం తప్పుదారి పట్టిందనే చెప్పాలి. కాని అవసరం వచ్చినపుడు మాత్రం తమ సమయస్ఫూర్తి చూపించారు. ఆపద్ధర్మ ప్రభుత్వానికి నాయకత్వం వహించే అవకాశం ఇవ్వమని యూనస్ పేరును సూచించింది యువకులే. విద్యార్థి సంఘాలు సూచించిన యూనస్ పేరును వెంటనే ఇతర ప్రజా సంఘాల నాయకులు బలపరిచారు. హింస, ప్రతిహింసలలో భాగంగా ప్రభుత్వాలు, పోలీసులు, సైన్యం తమ ప్రజలపైనే కాల్పులు జరపడానికి ఒక దశలో నిరాకరించాయి. పరిస్థితి తీవ్రతను గుర్తించిన హసీనా వెంటనే దేశం విడిచిపెట్టి పోవాలని నిర్ణయించుకున్నారు. ప్రజాభీష్టాన్ని అధికారులు తెలుసుకున్నారు గాని, రాజకీయ పార్టీలు గుర్తించలేకపోయాయి.

**ముందునుంచీ యూనస్‌ది పోరు దారే!**

కొన్నేళ్ల కిందట యూనస్ మూస పోకడల బ్యాంకింగ్ వ్యవస్థకు ఎదురుతిరిగి ఉద్యమించారు. ఎంతో కష్టపడి పనిచేసే తన దేశపు ప్రజలు నిరంతరం పేదరికంలో మగ్గిపోవడం అతనికి నచ్చలేదు. వారికున్న అనేకానేక అప్పుల భారం వల్ల, ఎవరూ వారికి రుణం ఇచ్చేవారు కాదు. దీనివల్ల మరింత పేదరికం వారిని ఆవరించేది. దీనికి విరుగుడుగా తానే ఒక బ్యాంక్ స్థాపించాలనుకున్నాడు. తన గ్రామీణ బ్యాంకు స్థాపించక మునుపు, తాను కొంత సొమ్మును రుణంగా తీసుకుని గ్రామీణ ప్రాంత ప్రజలకు రుణాలిచ్చాడు. తర్వాత ఒక వ్యవసాయ బ్యాంకుతో కలిసి కొన్ని ప్రయోగాలు చేసాడు. ఈ క్రమంలో అతనికి ఒక విషయం స్పష్టమైంది. ప్రభుత్వాలు సూక్ష్మ రుణాలను బీద రైతులకు ఇవ్వడానికి పెద్దగా ఇష్టపడవని ఆయన గ్రహించాడు. తాను స్వయంగా రుణాలిచ్చినా, వేరేవారితో ఒప్పందాలు కుదుర్చుకుని రుణాలు ఇప్పించినా ఏర్పడుతున్న పరిమితులను ఆయన గుర్తించాడు. విస్తృత పరిధిలో ప్రజలకు సూక్ష్మ రుణాలను అందించాలనే ఉద్దేశంతో, నిర్దిష్టమైన విధివిధానాలను రూపొందించుకుని గ్రామీణ బ్యాంకును స్థాపించాడు.

ప్రపంచమంతా ఎందుకూ కొరగారని నిర్లక్ష్యంగా చూసిన రైతాంగ మహిళలు ఈ గ్రామీణ బ్యాంకు రుణాల వల్ల, ఇంటిబయటకు కాలుపెట్టి, తమకు తోచిన వ్యాపారాలు చేసి, క్రమంగా రుణాలు తీర్చి, మరింత మెరుగైన రుణాలు తీసుకుని మరింతగా తమ వ్యాపారాలను విస్తరించగలిగారు. ఈ విధంగా సూక్ష్మ రుణాల విప్లవం తీసుకొచ్చిన గ్రామీణ బ్యాంక్ సేవలకుగాను దాని యజమాని మహమ్మద్ యూనస్‌కు 2006లో నోబెల్ శాంతి బహుమతి లభించింది. ఈ తరహా సూక్ష్మరుణాల ప్రభావశీలత గురించి కొందరు చెడుగా వ్యాఖ్యానించినప్పటికీ, బంగ్లాదేశ్‌లో మహిళలను ఎంతగానో నాగరికం చేసిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ముఖ్యంగా సనాతన ముస్లిం మతపెద్దలు తమ ఇంటి ఆడపడుచులు ఇలా వ్యాపారాలంటూ వీధుల్లో తిరగడాన్ని తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ ఈ వాణిజ్య నమూనా మాత్రం అద్భుత విజయాలు సాధించింది. యూనస్ రూపొందించిన ఈ సామాజిక వ్యాపార సూత్రం మార్కెట్‌శక్తులకు అనుకూలమని కొన్ని ఫిర్యాదులున్నాయి. ఎందుకంటే ఈయన వ్యాపారం ప్రారంభించాకనే, అమెరికా, ఇతర యూరప్‌దేశాలు బంగ్లాదేశ్‌లోకి తమ ఉత్పత్తులను వెల్లువలా ప్రవేశపెట్టాయి. అయితే తమ దేశంలోకి అభివృద్ధి నిధుల కోసం అమెరికా వైపు చూడకుండా భారత్, చైనాలతో చాలా నైపుణ్యంతో సంబంధాలు నెరిపారు షేక్ హసీనా. ఇప్పుడు యూనస్ అమెరికా వైపు మరలా కొంత మొగ్గు చూపవచ్చని కొందరు సామాజిక విశ్లేషకులు భావిస్తున్నారు.

పానకంలో పుడకలా ఈ సందులో దూరడానికి చైనా ప్రయత్నిస్తోంది. విద్యార్థులు కోపంతో బయటికి పొగబెట్టి పంపేసిన షేక్ హసీనాకు ఆశ్రయమిచ్చి ఆదుకుని భారత్ ఈ చదరంగంలో మొదటి పావును తప్పుగా కదిపింది. నిజానికి బంగ్లాదేశ్ చైనావైపు చూడడం పాశ్చాత్య ప్రపంచానికి మింగుడుపడదు. అయినా భారత్ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోలేదు. యూనస్ రాజకీయ మొగ్గు ఈ విషయంలో తాత్కాలిక ప్రభుత్వానికి మరింత ఆసరానిస్తుంది. అమెరికన్ విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తూ, అప్పుడే ఏర్పడిన బంగ్లాదేశ్‌కు ఆయన తన యవ్వనంలో వచ్చారు. కొత్తగా ఏర్పడిన దేశాన్ని పునర్నిర్మిస్తున్న షేక్ ముజిబుర్ రహమాన్ పట్ల గొప్ప ఆరాధనతో ఆయన దేశానికి వచ్చారు. అయినప్పటికీ అవామీ లీగ్, బంగ్లాదేశ్ జాతీయ పార్టీలు రెండింటికీ సమాన దూరంలో ఉండిపోయారు. కాని తర్వాత కాలంలో అవామీ లీగ్ పార్టీ హయాంలో షేక్ హసీనా అతన్ని రాజకీయంగా అష్టదిగ్బంధనం చేసిందనే చెప్పాలి. పన్నులు ఎగ్గొట్టాడని, అవినీతి ఆరోపణలతోనూ వెంటాడి వేధించింది.

**అవామీలీగ్ అంతమైనట్టేనా?**

అంతేకాదు, షేక్ హసీనా చేసిన ప్రజాస్వామ్యహననం తర్వాతి ఎన్నికల్లో కూడా నిరాటంకంగా సాగింది. దాదాపుగా 2014, 2018, 2024లలో జరిగిన ఎన్నికలలో ప్రత్యర్థి రాజకీయ పార్టీలను కనీసం పోటీ కూడా చేయనివ్వకుండా చేసింది. ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైన ప్రతిపక్షానికి దాదాపు చోటు లేకుండా చేసింది. ఈ విధమైన దారుణమైన నియంతృత్వం మూలంగానే తన పతనానికి తానే బీజాక్షరాలు రాసుకున్నట్టయింది. తన మరణశాసనాన్ని తానే లిఖించుకుంది. మొత్తంగా హసీనా ప్రభుత్వం అవినీతిమయం కావడంతో దానిని కాపాడేవారే లేకపోయారు. మొత్తంగా ఆ దేశంలో ప్రజాస్వామం మేడిపండు చందంగా తయారయ్యాక, 1971 స్వాతంత్ర్య పోరాట యోధుల వారసులకు ప్రభుత్వ ఉద్యోగాలలో 30 శాతం రిజర్వేషన్లు ఇస్తామనడం ఒక బోలు ప్రమాణంగా మిగిలింది. దీనిమీద ప్రజలెవరికీ పెద్దగా విశ్వాసం కుదరకపోయింది. నిరుద్యోగం తాండవిస్తోన్న వేళ ఉద్యోగాలలో రిజర్వేషన్లు ఇస్తాననడం వాళ్లను వెక్కిరించినట్లయింది. దాంతో అన్ని రకాల రిజర్వేషన్లు పోవాలని విద్యార్థులు కోరుకునే స్థితికి చేరుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సైన్యం రంగంలోకి దిగింది. నిరసనలను నియంత్రించాలని చేసిన ప్రయత్నంలో సుమారు 500 మంది స్త్రీలు, పురుషులు, పిల్లలు అసువులు బాసారు. కొన్ని వారాలపాటు బంగ్లాదేశ్ అట్టుడికిపోయినట్టు అతలాకుతలం అయిన తర్వాత షేక్ హసీనా దేశం విడిచిపెట్టి పారిపోయారు. ఆమె తండ్రి హత్యకు గురైనాక ఆ దేశంలో ఘన నివాళి అర్పిం చారు. కాని, దానికి పూర్తి వ్యతిరేకంగా హసీనాను అక్కడి ప్రజలే తరిమేశారు.

అవామీ లీగ్, బంగ్లాదేశ్ జాతీయ పార్టీలకు భిన్నంగా మూడో రాజకీయ పార్టీ అవతరించే అవకాశం ఆ దేశంలో ఉంటుందని ఎవరూ ఊహించలేదు. ఒకప్పుడు యూనస్‌కు కొంత రాజకీయ ఆసక్తి ఉండేది కాని, దాడి చేయడం ద్వారా షేక్ హసీనా అతడిని పూర్తిగా అణిచేసింది. ఇప్పుడు ఆయన ఆసక్తి మళ్లీ రూపుదాల్చవచ్చు. గడిచిన కొన్ని వారాలుగా బంగ్లాదేశ్‌లో జరుగుతోన్న పరిణామాల పట్ల భారత దేశంలో డెమోక్రాట్లు విభిన్నంగా స్పందించడాన్ని యూనస్ వ్యతిరేకించారు. బంగ్లాదేశ్ పట్ల ఎలాంటి అనుమానాలు పెట్టుకున్నా అది మన దేశానికి ఎలాంటి మేలు చేయదని హెచ్చరించారు. ఇంతవరకూ గడిచిన పదేళ్లలో మన ప్రధాని మోదీ విదేశాంగ విధానంలో పరిణతి ప్రదర్శించిందే లేదు. ఇప్పుడు యూనస్ వ్యాఖ్యలకు ఎలా సమాధానమిస్తారో చూడాలి.

## ఏపీ చిట్‌ఫండ్స్ వైస్ ప్రెసిడెంట్‌గా మధు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఏపీ చిట్‌ఫండ్స్ సమాఖ్య రాష్ట్ర వైస్‌ప్రెసిడెంట్‌గా కొన్నా చిట్స్ అధినేత కొన్నా మధుసూదనరావును ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అద్యక్షులుగా ఎంవీ చౌదరి (పోర్టుసిటీ చిట్స్), ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీహరి (సుభకృతి చిట్స్), కోశాధికారిగా ఆర్.మోహనరావు (శ్రీరామచరణ చిట్స్), వైస్ ప్రెసిడెంట్స్‌గా ఎన్.గంగాధరరావు (విజేతచిట్స్), యాదవ్‌రెడ్డి (కపిల్ చిట్స్), పి.అనిల్ కుమార్ (శ్రీలక్ష్మీ వెంటకరమణ చిట్స్)ను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా కొన్నా చిట్స్ అధినేత కొన్నా మధుసూదనరావు ఎంపిక పట్ల చిట్స్ సిబ్బంది, పలువురు ఖాతాదారులు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

## దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

**- బీజేపీ నేత చల్లా వెంకటేశ్వరరావు**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీజేపీ జాతీయ కౌన్సిల్‌సభ్యుడు చల్లా వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం జిల్లాకు చెందిన వివిధ దివ్యాంగ సంక్షేమ సంఘాల నాయకుల సమావేశంలో పాల్గొన్న చల్లా వెంకటేశ్వరరావు మాట్లాడారు. జిల్లా కేంద్రంలో దివ్యాంగుల కోసం ఒక కమ్యునిటీ భవనం నిర్మాణం చేయడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. నకిలీ వైకల్య సర్టిఫికెట్లపై విచారణ వేగవంతం చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోనేలా ఉన్నతాధికారులను కోరనున్నట్టు తెలిపారు. జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ నిర్వహించే ప్రతి కార్యక్రమం వివరాలను, ముందుగా వికలాంగుల సంఘాల నాయకులకు తెలియజేయాలని కోరారు. జిల్లాలో ఉన్న దివ్యాంగుల సమాచారాన్ని దివ్యాంగ సంఘాల ప్రతినిధులకు అందజేయాలని కోరారు. జిల్లా దివ్యాంగుల అడ్వైజరీ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాటసమితి జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి భాస్కరరావు, డా.ఎంకె. మిశ్రో, చింతు గణపతి, కళ్లేపల్లి ఉషారాణి, గురుగుబిల్లి రమణ మూర్తి, అడపా అప్పలనాయుడు, పులిగోత్ర మాధవిలు పాల్గొన్నారు



## ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దేశ స్వాతంత్ర్య ఉద్యమ పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ ప్రతి ఒక్కరిలోనూ జాతీయతభావం, ఐక్యమత్యం, జాతీయ సమగ్రత పెంపొందించేలా ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరేయాలని సెట్‌శ్రీ సిఇఓ బివి ప్రసాదరావు పిలుపునిచ్చారు. స్థానిక గాంధీ మందిరంలో ఆదివారం స్వాతంత్ర్య సమరయోధులను స్మరిస్తు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోడీ ఆదేశాల మేరకు రాష్ట్రంలో అన్నిజిల్లాలలోని ప్రభుత్వ కార్యాలయాలు, అన్ని విద్యాసంస్థల్లో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహంతో పాటు రవీంద్రనాథ్ ఠాగూర్, బాలగంగాధర్ తిలక్, టంగుటూరి ప్రకాశం పంతులు, పింగళి వెంకయ్య, బంకించంద్ర చటోపాధ్యాయ, లాల్ బహుదూర్ శాస్త్రి, భారతరత్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాబార్డ్ డిజిఎం రమేష్ కృష్ణ, జిల్లా పౌర సంబంధాల అధికారి కె బాల మాన్‌సింగ్, లైన్స్‌క్లబ్ ప్రతినిధి నటుకుల మోహన్, ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ సన్యాసిరావు, జిల్లా పర్యాటక అధికారి నడిమింటి నారాయణరావు, అనంతభట్లు, స్వచ్ఛందసంస్థ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

మునసబుపేటలోని గాయత్రి కళాశాల వేదికగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలను ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో పవర్ లిఫ్టింగ్, వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు ఉండే ప్రత్యేకతే వేరన్నారు. వీటి సాధన కూడా అంతే వైవిధ్యభరితంగా ఉంటుందని చెప్పారు. జిల్లాకు చెందిన కరణం మల్లేశ్వరి, నీలంశెట్టి లక్ష్మీ వంటి క్రీడాకారులు సిక్కులు కీర్తిని జాతీయస్థాయిలో ఇనుమడింజేశారన్నారు. కరణం మల్లీశ్వరి ఒలింపిక్స్‌లో పతకం సాధించడం ద్వారా భారతదేశంలోనే సిక్కోలు పేరు మారుమోగించిందన్నారు. క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తు కోసం తమంత సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జాతీయస్థాయి క్రీడాకారుని నీలం శెట్టి లక్ష్మీ, టీడీపీ నాయకులు కలగజగదీష్, గాయత్రి విద్యాసంస్థల అధినేత స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.




## గురుకులంలో మిగులు సీట్లకు దరఖాస్తులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పెద్దపాడు అంబేద్కర్ గురుకులం(బాలికలు)లో మిగులుసీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మార్పుజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ఎస్సీ కేటగిరిలో 18సీట్లు, 6వ తరగతి ఎస్సీ కేటగిరిలో 4సీట్లు, 7వ తరగతిలో ఎస్సీ కేటగిరిలో 1సీటు, 8వ తరగతి ఎస్సీ కేటగిరిలో 1సీటు, 9వ తరగతి ఎస్సీ కేటగిరిలో 1సీటు, ఎస్టీ కేటగిరీలో 1 సీటు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎస్సీ కేటగిరిలో 12, ఎస్‌టి కేటగిరీలో 1, బీసీ కేటగిరీలో 1, ఓసీ కేటగిరీలో 1 ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సీట్లు కావాల్సిన విద్యార్థినిలు ఈనెల 13న ఉదయం 10 గంటలకు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో గురుకులంలో హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు. సీట్లకు మించి అధికంగా విద్యార్థుల హాజరైతే పరీక్ష విధానాన్ని బట్టి సీట్లు కేటాయిస్తామని ప్రిన్సిపల్ తెలిపారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

**- రూ.లక్ష విరాళం ఇచ్చిన వాకా రాంబాబు**

(సత్యంన్యూస్, నరసన్నపేట)

సారవకోట మండలం బుడితి హైస్కూల్‌లో 1982-83 సంవత్సరం పదోతరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయకలయిక ఆదివారం ఘనంగా నిర్వహంచారు. ఈసందర్భంగా ఉన్నతమైన విద్యను అందించి సమాజంలో మంచిపౌరులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు రాజేశ్వరరావు, సత్యన్నారాయణ, సింహాచలం, హరిసత్యంను 1950లో హైస్కూల్ ఏర్పాటుకు స్థలాన్ని దానంచేసిన ఫౌండర్ ప్రెసిడెంట్ దివంగత పొన్నాన చిన్నికృష్ణంనాయుడు వారసులు పొన్నాన సీతారామునాయుడుని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పొన్నాన సీతారాం నాయుడు మాట్లాడుతూ బుడితి ఉన్నత పాఠశాల ఏర్పాటైన నాటినుంచి ఇప్పటి వరకు అభివృద్ధి జరగడానికి సహకరించిన పెద్దలకు, పూర్వ విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. ఉన్నతస్థితిలో ఉన్న పూర్వవిద్యార్థులు పాఠశాల అభివృద్ధికి ఇతోధికంగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. పూర్వవిద్యార్థి వాకా రాంబాబు రూ.లక్ష విరాళం ప్రకటించారు. దీన్ని ఫిక్సడ్‌డిపాజిట్ చేసి స్వర్గీయ ముత్యాల భాస్కరరావు మాస్టర్ పేరు మీద ప్రతీ ఏడాది పదోతరగతిలో ఉత్తమ ఫలితాన్ని సాధించిన విద్యార్థికి బహుమతిగా అందజేయాలని కోరుతూ చెక్కును భాస్కరరావు భార్య రమాదేవి ద్వారా హెచ్‌ఎం మాధవరావుకు అందించారు. కార్యక్రమంలో గేదెల రఘునాథరావు నాయుడు, వారణాసి సర్వేశ్వరరావు, కుంచి శ్రీరాములు, గొల్లంగి మోహనరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# ఆదర్శప్రాయులు గోవిందరాజులు

(సత్యంన్యూస్, గార)

కొంక్యాన గోవిందరాజులు ఆదర్శప్రాయులని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశ్రాంత సామాజిక ఆరోగ్య అధికారి కొంక్యాన గోవిందరాజులు 14 వర్ధంతి సందర్భంగా గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వేణుగోపాలపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో మెగా ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహంచారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ విద్య, వైద్యం, ఆరోగ్యం సామాజిక అభివృద్ధిలో గోవిందరాజులు విశేషమైన కృషి చేశారని, ఆయన జీవించి ఉన్న కాలంలో చేపట్టిన కార్యక్రమాలను వారి కుటుంబసభ్యులు కొనసాగించడం అభినందనీయమన్నారు.

**ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి: డాక్టర్ దానేటి**

మెడికవర్ ఆసుపత్రి ఎండి, ప్రముఖ లేప్రోస్కోపిక్స్ ఐవీఎఫ్ వైద్య నిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ కొంక్యాన గోవిందరాజులు ఎన్నో ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహించేవారని, అదే ఒరవడిని వారి కుటుంబసభ్యులు కొనసాగించడం అభినందనీయమన్నారు. ఆరోగ్యంపై గ్రామీణ ప్రజలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, దీనిపై అవగాహన ఉన్నప్పుడే మెరుగైన వైద్యం పొందే



అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుండ భాస్కరరావు, శాలిహుండం సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణ, శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ శిష్ణు మనోజ్‌కుమార్, స్త్రీ ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ కొంక్యాన మాధురి, ఎముకలు కీళ్ల వైద్య నిపుణురాలు డాక్టర్ సంగీతావాణి, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులు డాక్టర్ దొంతం ఆదిత్య, డాక్టర్ ప్రియాంక, మాజీ సర్పంచ్ బోర ఎర్రన్నాయుడు, పాఠశాల హెచ్‌ఎం పి.మంగమ్మ, కొంక్యాన ట్రస్టు ప్రతినిధులు కొంక్యాన రాధాకృష్ణ, కోట సావిత్రమ్మ, కొన్న నరసింహమూర్తి, వెంకటరమణమ్మ, గోవిందరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# కరపత్రం సరే.. 'ఆఫ్‌లైన్' కహానీ ఏంటి?

(మొదటిపేజీ తరువాయి)

ఆదివారం షేర్ చేశారు. అయితే, కొన్ని కీలకమైన అంశాలను ఆయన దాటవేశారు.

- అప్పటి వైకాపా నాయకులు వాట్సాప్‌లలో పంపిన ఉపాధ్యాయుల బదిలీ జాబితాను ఆమోదించలేక ఆరోగ్యం బాగులేదని తప్పుకున్నానని తిరుమలచైతన్య తన కరపత్రంలో ఒప్పుకున్నారు. కానీ అప్పటికే ఆయన బదిలీల ప్రక్రియ పూర్తిచేశారన్న విషయాన్ని తొక్కిపెట్టేశారు. ఆఫ్‌లైన్‌లో ఏడుగురికి కౌన్సిలింగ్ చేసి కోరుకున్న చోటకు బదిలీ చేసిన విషయాన్ని కూడా ప్రస్తావించివుంటే బాగుండేది. ఇక్కడ సొమ్ములు చేతులు మారాయా? లేదూ అంటే రాజకీయ నాయకుల ప్రాపకం కోసం చేశారా? అనే విషయం చెబితే మరింత నిఖార్సుగా ఉండేది.
- 2023 జూన్ 8 నాటికి బదిలీ ప్రక్రియ పూర్తయితే జూన్ 11న ఆఫ్‌లైన్‌లో ఏడుగురు ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ ఎలా నిర్వహించారు? రాష్ట్రవ్యాప్తంగా వెబ్ కౌన్సిలింగ్ నిర్వహిస్తే.. శ్రీకాకుళం జిల్లాలో ఆఫ్‌లైన్‌లో కౌన్సిలింగ్ ఎందుకు చేసారు? 2023 జూన్ 2న ఉపాధ్యాయుల బదిలీకి అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిన తర్వాత రోజు నుంచి డీఈవో కార్యాలయంలో విద్యుత్ సరఫరా ఎందుకు నిలిచిపోయింది? ఒకవేళ షార్ట్ సర్క్యూట్ అయిందే నిజమైతే, బదిలీ ప్రక్రియ పూర్తి అయిన మరుసటి రోజు విద్యుత్ పునరుద్ధరణ కావడం కాకతాళీయమా? ప్రీప్లానా? ఇది కూడా చెబితే బాగుండేది.
- డీఈవో తిరుమల చైతన్య కనుసన్నల్లో ఏపీవో తేజ ఇంటి నుంచి సీనియారిటీ జాబితాను తీసుకువచ్చి వారం రోజులు కథ నడిపించారన్న ఆరోపణలకు ఏం సమాధానం చెప్పారు? సీనియార్టీ లిస్టులను ప్రదర్శించకుండా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణం చూపించి అక్రమాలకు పాల్పడ్డారన్న ఉపాధ్యాయ సంఘాల వాదనకు మీ దగ్గర ఉన్న సమాధానమేమిటి? రోస్టర్ పాయింట్స్, కమ్యూనిటీ రోస్టర్ పాయింట్ ఎక్కడ ఎగ్జాస్టర్ అవుతుందన్న అంశం బహిర్గతం చేయకుండా డేటాను ఫాబ్రికేట్ చేయించినట్టు తిరుమల చైతన్యపై ఆరోపణలు ఉన్నాయి. మాస్టర్ డేటాను ఏపీవో చేతిలో ఉంచి టీచర్ ఇన్‌ఫర్మేషన్ సిస్టంను డబ్బులు ఇచ్చిన వారికి అనుకూలంగా మార్పులు చేసి కొందరు టీచర్ల డేటాను హైడ్ చేసినట్టు ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేసాయి. సందర్భాన్ని బట్టి మాస్టర్ డేటాలో తేదీలు మార్పు చేసి కొందరిని తప్పించి, అనుకూలమైన వారిని కంపల్సరీ చేసినట్టు కొందరు ఉపాధ్యాయులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనికి ఏం సమాధానమిచ్చారు?
- స్పౌజ్ పాయింట్లు ఎనిమిదేళ్లు, హెచ్‌ఎంలకు ఐదేళ్లుగా బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొన్నా, ఎనిమిదేళ్లు పూర్తి అయినా మాస్టర్ డేటా బేస్‌లో బదిలీలకు సంబంధించిన స్పౌజ్ పాయింట్ల ఆధారాలను మార్చేశారన్న ఆరోపణల సంగతేమిటి?
- తిరుమల చైతన్య ఆధ్వర్యంలో తయారుచేసిన సీనియార్టీ జాబితాను కౌన్సిలింగ్ చివరి క్షణం వరకు బయట పెట్టకుండా అక్రమాలకు పాల్పడ్డారని, ఒక ప్రైవేట్ వ్యక్తి గుట్టుగా ఈ వ్యవహారం నడిపించారని ఆరోపణలు ఉన్నాయి.
- 20 శాతం ఖాళీలను ఇక్కడ బ్లాక్ చేయడం వెనుక స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ అనుమతులు ఉన్నాయా? బ్లాక్ చేసిన ఖాళీల్లోనే మాన్యువల్‌గా కౌన్సిలింగ్ చేసి కొందరికి ఫేవర్ చేసిన అంశంపై మాట్లాడితే బాగున్ను.
- జూనియర్ల కంటే ఎక్కువ పాయింట్లు కలిగివున్న సీనియర్లను వెబ్ కౌన్సిలింగ్‌లో దూర ప్రాంతాలకు సాగనంపలేదా? దీనిపై బాధితులు ఆర్‌జేడీకి అప్పీల్ చేస్తే, జేడీ మువ్వా రామలింగం, ఆర్జేడీ జ్యోతికుమారిని అడ్డం పెట్టుకొని అప్పీలు చేసిన బాధిత ఉపాధ్యాయులకు అన్యాయం చేశారా? లేదా?

# శాస్త్రీయ కులగణన జరగాలి

**- కలెక్టర్‌కు రెల్లి సంక్షేమ సంఘం వినతి -**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అశాస్త్రీయంగా చేపట్టిన కులగణన కారణంగా రెల్లి కులస్తులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని, శాస్త్రీయంగా కుల గణన జరగాలని జాతీయ రెల్లి, గ్రూప్ కులాల సంక్షేమ సంఘం ప్రతినిధులు జాతీయ ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్, పట్టణ కార్యదర్శి అర్జి ఈశ్వరరావు, జిల్లా అధ్యక్షులు గొల్లపిల్లి మోహనరావు డిమాండ్ చేశారు. సోమవారం పాతబస్టాండ్ నుంచి జిల్లా పరిషత్ వరకు రెల్లి సామాజిక వర్గ 12 ఉపకులాలకు చెందిన ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రీవెన్స్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో 2000–04 వరకు ఎస్సీ ఏ,బీ,సీ,డీ వర్గీకరణ కొనసాగించారని, ఎస్సీ–ఎ రెల్లిగ్రూపు కులాలకు కేటాయించిన ఒక్కశాతం రిజర్వేషన్ రోస్టర్ నెం.2 ప్రకారం మహిళలకు కేటాయించడం వల్ల తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. దీని వలన రెల్లిగ్రూపులో ఉన్న పురుషులకు వివిధ విద్యా సంస్థల్లో, వివిధ శాఖల ఉద్యోగాల్లో అవకాశం లేక తీవ్రమైన అన్యాయానికి గురయ్యారని వివరించారు. సుప్రీంకోర్టు 2004 నవంబరు 5న ఈ చట్టాన్ని సమీక్షించి ఎస్సీ ఏ, బీ, సీ, డీ చట్టాన్ని రద్దు పరిచారని, 59 ఎస్సీ ఉపకులాలలో అందరికంటే విద్య, ఉద్యోగ, ఉపాధి, సామాజిక, ఆర్థికంగా అట్టడుగులో ఉన్న రెల్లిగ్రూపు కులాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక అవకాశాలు కల్పించాలని కోరారు. ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ అనివార్యమైతే ఎస్సీల్లోని 59 కులాల వారిని కులగణన చేసి తర్వాత రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందిన మాల, మాదిగ కులాలను ఒక గ్రూపులో చేర్చాలని కోరారు. ఎస్సీ గ్రూపులో ఇంతవరకు ఎటువంటి విద్య, ఉద్యోగ, ఉపాధి ఆర్థిక అభివృద్ధి చెందని 57 కులాలను ఒకే గ్రూపులో చేర్చి రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ర్యాలీలో జలగడుగుల శ్రీరామ, కళ్యాణి వెంకటరావు, జె.గోవిందరావు, అరుగుల గణేష్, అర్జి జ్యోతికుమార్, నల్లపిల్లి కష్ణ, జె.శ్రీనివాసరావు, కవ్వాడి రవి, ఆకుల అప్పారావు, ధనాల రమణ, అరుగుల నాగేశ్వరరావు, బైరిశెట్టి బుజ్జిరాజు, ఎన్. హరి, పొట్నూరు గోపి, పొట్నూరు గణేష్, తుపాకుల రవి, నల్లపిల్లి కాంచనమ్మ, అరుగుల రాజులమ్మ, బంగారి రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు.









# ప్రతీ ఇంటిపై భారత త్రివర్ణ పతాకం

(సత్యంన్యూస్, రాజాం)

స్థానిక రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో భాగంగా ప్రతీ ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలని చైర్మన్ కొత్తాసాయిప్రశాంత్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ స్వప్న హైందవి పిలుపునిచ్చారు. స్థానికులతో కలిసి త్రివర్ణపతాకంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, ఉల్లాకుల నీలకంఠయాదవ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




# దళిత ఉద్యోగులపై జీఎస్టీ జేసీ చిన్నచూపు

(మొదటిపేజీ తరువాయి)

విజయనగరం జాయింట్ కమిషనర్‌గా బదిలీ అయ్యారన్నారు. సంఘం జిల్లా శాఖ అధ్యక్షురాలిగా ఉన్న తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ సస్పెన్షన్ చేసారని ఆరోపించారు. సమాజంలో ఆమె వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతిసే ప్రయత్నం చేసి మానసిక క్షోభకు గురిచేశారన్నారు. నాగార్జునరావుపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని, 2023 ఏప్రిల్‌లో ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఒంటరి దళిత మహిళ అనే చులకన భావంతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదును పునఃపరిశీలించి జాయింట్ కమిషనర్ బుడుమూరు నాగార్జునరావుపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి మరోమారు ఫిర్యాదు చేసినట్టు రాజేశ్వరి తెలిపారు. వాస్తవాలు పరిగణలోనికి తీసుకుని న్యాయం చేయాలని కోరినట్టు పేర్కొన్నారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానన్నారు.








సీతంపేట శాఖా గ్రంథాలయంలో రంగనాథన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆచార్య రంగనాథన్ పుట్టినరోజును "లైబ్రేరియన్స్ డే"గా ప్రకటించి నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో సహాయకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **- సత్యంన్యూస్, సీతంపేట**



366 రోజు నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా పూజారిపేటకు చెందిన కొత్తకోట అజయ్ పుట్టినరోజు సందర్భంగా తల్లితండ్రులు రామచంద్ర రావు, విజయలక్ష్మి దంపతులు 35 మందికి సోమవారం అన్నదానం చేశారు. **- సత్యంన్యూస్, ఆమదాలవలస**

# ప్రేమ, సౌభ్రాతృత్వాలను నెలకొల్పాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రేమ, సౌభ్రాతృత్వలను నెలకొల్పి పతనమవుతున్న మానవ సంబంధాలను నెలకొల్పడానికి సంకల్పించినట్టు బొబ్బిలి మద్రాసీ నిర్వాహకులు అబ్దుల్ కలాం అన్నారు. ఆదివారం జిల్లా అమీర్ షేక్ సలీం ఆధ్వర్యంలో స్థానిక పీఎస్ఎన్ఎం హైస్కూల్ ఎదురుగా ఉన్న మీనా మసీదులో అల్ ఇండియా మానవత్వ సందేశ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ సంబంధాలు తెలిపేందుకు సభలు, సమావేశాలు నిర్వహించి నైతిక విలువలను ప్రోత్సాహించే సాహిత్యాన్ని పలుభాషల్లో ప్రచురించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిమ్ మైనార్టీ పెద్దలు పాల్గొన్నారు.




# ఓబిసి సాధనకు సహకరించండి

**- మంత్రులకు విన్నవించిన శిష్టు కరణ సంఘం**



(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

ఓబీసీ సాధనకు సహకరించాలని ఢిల్లీ పర్యటనలో పలువురు పార్లమెంటు సభ్యులను, మంత్రులను, గవర్నర్‌ను కలిసి ఏపీ శిష్టకరణసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు కోరారు. ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన శిష్టకరణాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్పించాల్సిన ఆవశ్యకతను గురించి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను, కేంద్ర బొగ్గుగనులశాఖ మంత్రులు కిషన్‌రెడ్డి, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కేంద్ర ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్, బీజేపీ నాయకులు సోమువీర్రాజుని కలిసి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఢిల్లీకి చెందిన వెంకుమహంతి మోహనరావు, శ్రీనివాసరావు, విశాఖపట్నానికి చెందిన సన్‌మూర్తి, కూరాడ పావని పాల్గొన్నారు.

# ఘనంగా ఎస్సార్ రంగనాథన్ జయంతి


(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

లావేరు శాఖ గ్రంథాలయములో సోమవారం గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్సార్ రంగనాథన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా రంగనాథ్ చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగనాథన్ భారతదేశంలో తమిళనాడులోని షియాలీలో జన్మించి లైబ్రరీ సైన్స్‌రంగంలో దూరదృష్టి గల మార్గదర్శకుడన్నారు. గ్రంథాలయ నిర్వహణ సమాచార సేవలను వేగంగా చదువులకు అందించడంలో ఆ సంస్థలను విప్లవాత్మకంగా మార్చివేయడంలో పరిశోధన శాస్త్రవేత్తగా నిలిచారన్నారు. గ్రంథాలయ శాస్త్రంలో ఐదు ప్రధానసూత్రాలు కనుగొని వాటిని విస్తృతంగా ప్రచారం చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులను విద్యార్థులకు గ్రంథాలయము తరుపున అందజేశారు. కార్యక్రమములో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం







(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ (రిజిస్ట్రేషన్ నంబర్ 12/2022) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక 80ఫీట్ రోడ్డులోగల వి–1 రెస్టారెంట్లో అధ్యక్షులు నక్క రామకృష్ణ అధ్యక్షతన అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2024–26 ఆర్థిక సంవత్సరానికి నూతనకార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా సంకు అజయ్ చక్రవర్తి, కార్యదర్శిగా నక్క రామకృష్ణ, కోశాధికారిగా అగడప్రోలు రంగస్వామి, మీడియా కో–ఆర్డినేషన్ బాధ్యతలను నారా ఈశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా గండేపల్లి జగన్నాధరావు, ఉపాధ్యక్షులుగా కింతలి రమేష్‌బాబు, మెట్ట నాగరాజు, టి.గణపతిరావు, డి.సునీల్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు ఎం.దాలిరాజు, చింతాడ వెంకట చంద్రమౌళీశ్వరరావు, కె.త్రినాధరావు, జివిఎల్ కుమార్ (వెంకీ), బాపట్ల కిరణ్ గాంధీ. ఏఆర్ఎన్‌వీ సత్యన్నారాయణ, కార్యవర్గ సభ్యులు బోను గోవింద్, నాగరాజు, నల్లబారికి శ్రీనివాసరావు, ఎర్రచైతన్య, గుడ్ల రేవంత్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు సంకు అజయ్‌చక్రవరి మాట్లాడుతూ జిల్లాలో బ్యాడ్మింటన్ అభివృద్ధికి, బాలబాలికలకు బ్యాడ్మింటన్‌లో ప్రోత్సహించేందుకు సంఘం ద్వారా కృషి చేస్తానన్నారు. రానున్న రెండేళ్ల జిల్లా నుంచి స్టేట్ ఛాంపియన్స్‌గా బాల, బాలికలని తయారుచేయడమే ఈ సంఘ ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ నటుకుల మోహన్, కో–చైర్మన్ తర్లాడ అప్పలనాయుడు, హానరబుల్ ప్రెసిడెంట్ అనుమంచిపల్లి వేణు గోపాలరావు, ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ధవళ రాజేంద్రకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

# ఆదివాసీల భూముల జోలికి వస్తే సహించం

**- ఆదివాసి సంక్షేమపరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి -**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మాకివలస ఆదివాసీల భూమి జోలికివస్తే సహించమని ఎంతవరకైనా పోరాడుదామని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి తెలిపారు. ఆదివాసీ సంక్షేమపరిషత్ ఆధ్వర్యంలో సోమవారం 7రోడ్ల జంక్షన్ నుంచి జిల్లా పరిషత్ వరకు ఆదివాసీలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలుమూరు మండలం ఎస్టీ మాకివలస (డి) ఆదివాసీలకు అండగా జిల్లా వ్యాప్తంగా ఆదివాసీలు తరలివచ్చారన్నారు. ఆదివాసీలు సాగు చేస్తున్న భూములను ఊణ్ణ సత్యనారాయణ గుప్తా దౌర్జన్యంగా ఆక్రమించారని ఆరోపించారు. కూర్మ గ్రామం స్వామిజీలు, ఊణ్ణ సత్యనారాయణ గుప్తా కలిసి ఆదివాసీలపై దాడులు దిగుతున్నారని ఆరోపించారు. రెవెన్యూ యంత్రాంగం ఆదివాసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల సాగులో ఉన్న భూమిని కూర్మ గ్రామ స్వామీజీలకీ 15 ఎకరాలు విక్రయంచినట్టు ఆరోపించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి ఆదివాసీల సాగులో ఉన్న భూమికి పట్టాల మంజూరు చేసి శ్మశానవాటికను, చెరువును, పాఠశాలను, గ్రామానికి విద్యుత్ సౌకర్యం, తాగునీరు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అఖిలభారత రైతుకూలీసంఘం రాష్ట్ర నాయకులు వంకల మాధవరావు, జమ్మయ్య, భాస్కర్, సవర వెంకటేష్, ఎస్టీ మాకివలస గ్రామం పెద్దలు ఉత్తరయ్య, పాపారావు, ప్రసాద్, భాగ్య, అదేమ్మ, సూరపునాయుడు, కళ్యాణి, హరీష్, పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.